క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌గఢ్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు..

నెహ్రూనగర్, మస్కతి పార్క్, రెయిన్‌బజార్ గ్రౌండ్, కార్నర్ టీ పాయింట్, గాంధీ కా పుత్లా, మినాజ్ బేకరీ, గౌస్ డెయిరీ, డెక్కన్ ఫంక్షన్ హాల్, ఆర్‌కే హోటల్, మొగల్ టీ పాయింట్, కుమరవాడి, జ్యోతీబాగ్, రజా నగర్, ఎంబీటీ హట్, మెహిదీ కార్నర్, అఫ్జర్ ఖానా, గ్రీన్‌ల్యాండ్, సాకేత్ డిగ్రీ కాలేజ్, సాయి డిగ్రీ కాలేజ్, స్ఫూర్తి డిగ్రీ కాలేజ్, సంతోషి మాతా టెంపుల్ ఏరియా, దిల్‌సుఖ్‌నగర్ బస్‌డిపో, జ్ఞానదీప్ టవర్స్, కృష్ణతులసీ నగర్, ఆందాశ్ నిలయం, దిల్‌సుఖ్‌నగర్ రోడ్, ఎస్‌బీహెచ్ బ్యాంక్, ఇంద్రానగర్, రాజరాజేశ్వరీ టెంపుల్, ఎస్‌బీఐ కాలనీ పార్క్, డీబీఆర్ డయాగ్నస్టిక్ సెంటర్, తనిష్క్ జువెల్లర్స్, నోబుల్ డిగ్రీ కాలేజ్, భూలక్ష్మీ నగర్, తిరుమల హిల్స్, గడ్డిఅన్నారం, కల్యాణ్‌నగర్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు..

స్టాండ్లీ కాలేజ్, దర్గా ఏ ఉజాలేషా, జీవన్ జంగ్ కాలనీ, డీ క్వార్టర్స్, రహ్మానియా మజీద్, ఏక్ ఖానా మజీద్, గర్ల్స్ స్కూల్, మెహరాజ్ మజీద్, గుడ్డి బౌలి, చంచల్‌గూడ, జామ్ జామ్ మెడికల్ హాల్, మదీన మజీద్, సిరిపురం కాలనీ, మనోజ్ మాన్షన్ అపార్ట్‌మెంట్స్, సిరిపురం కాలనీ కమ్యూనిటీహాల్, క్యాపిటల్ హోటల్, ఆస్మాన్‌ఘడ్, సేఫ్ హాస్పిటల్, బీకే ఫంక్షన్‌హాల్ బ్యాక్‌సైడ్, ఆంధ్రాబ్యాంక్ కాలనీ పరిసర ప్రాంతాలు.

నేడు రైతుబజార్‌కు సెలవు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ రైతు బజార్‌కు ప్రతి నెల మూడవ బుధవారం సెలవు ఉన్నందున ఎలాంటి క్రయ విక్రయాలు ఉండవని ఈఓ ప్రవంతి తెలిపారు. గురువారం యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ దుర్గాభవానీనగర్ కాలనీకి చెందిన విజయ గత కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రెక్కాడితే కాని పూటగడవని విజయ కుటుంబ సభ్యులకు ఆసుపత్రి చికిత్స బిల్లు చెల్లించేందుకు అప్పు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయించగా ఆమెకు మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీని విజయ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

నూతన కమిటీ ఎన్నిక

ఎల్‌బీనగర్: బీజేపీ మన్సూరాబాద్ డివిజన్ సభ్యులు మంగళవారం మన్సూరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జగన్, ప్రమోద్‌రెడ్డి, సంపత్‌గౌడ్, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా శ్యాంసుందర్‌రెడ్డి, నవీన్‌రావు, కార్యదర్శులుగా మోహన్ రెడ్డి, నరసింహుడు, గోవిందరెడ్డి, విజయలక్ష్మి, కోశాధికారిగా దామోదర్‌గౌడ్, ఆఫీస్ ఇన్‌చార్జిగా ఎల్లారెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా మంగారెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా ప్రవీణ్‌కుమార్‌గౌడ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా మెరిగమల్ల విజయ్‌కుమార్ ఎన్నికైనట్లు అధ్యక్షుడు తెలిపారు.

సురేష్‌కు క్యాష్ అవార్డు



క్యాష్‌అవార్డు అందుకుంటున్న సురేష్

ఎల్‌బీనగర్: 6వ ఐడబ్ల్యూపీఎల్ ఇండియన్ వీల్ చైర్ క్రికెట్ పోటీలు ఈ నెల 15న న్యూఢిల్లీలో ముగిశాయి. ఈ పోటీల్లో హైదరాబాద్ హరికేన్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. పోటాపోటీగా జరిగిన ఫైనల్‌లో హైదరాబాద్ హరికేన్ జట్టుపై ఢిల్లీ దబాంగ్ జట్టు విజయం సాధించింది. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన హైదరాబాద్ హరికేన్ జట్టు వైస్ కెప్టెన్ ఎల్‌బీనగర్ వాసి ధరవత్ సురేష్ రూ.5 వేల క్యాష్ ప్రైజ్‌ను అందుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఫైనల్ మ్యాచ్‌లో అత్యధికంగా 62 పరుగులు సాధించినట్లు సురేష్ తెలిపారు.

మా స్థలాన్ని మాకు ఇప్పించండి

- హైడ్రా కమిషనర్‌కు ఇండస్ట్రీస్ సొసైటీ సభ్యుల వినతి



హైడ్రా కమిషనర్‌కు తమ సమస్య వివరిస్తున్న ఇండస్ట్రీస్ సొసైటీ సభ్యులు

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలోని తమ హౌజింగ్ సొసైటీకి చెందిన స్థలాన్ని తమకు ఇప్పించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయిస్ హౌజ్ బిల్డింగ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు కోరారు. మంగళవారం సొసైటీ సభ్యులు ఆయనను హైడ్రా కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ విభాగాల్లో చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకునే తాము ప్రభుత్వ నిబంధనల మేరకు పూర్తి సొమ్ము చెల్లించి కొనుగోలు చేసిన స్థలాన్ని ఇప్పటి వరకు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. 1976లో ఏర్పడిన తమ సొసైటీ 1981లో సైదాబాద్ మండల సర్వే నెం: 65 టు 77, 133 (పార్ట్), 125 (పార్ట్)లోని 25 ఎకరాల భూమిని ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని విధాల చెల్లింపులు చేసుకున్నామన్నారు. సొసైటీలోని 294 సభ్యుల కోసం స్థలాన్ని 314 ప్లాట్లుగా ఏర్పాటు చేశామని వారిలో 54 మంది సభ్యులు అక్కడే ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నారన్నారు. అయితే మిగిలిన స్థలంలో స్థానిక నాయకుల ప్రోద్బలంతో కొందరు గుడిసెలు వేసుకున్నారని వివరించారు. 42 సంవత్సరాల క్రితం భూమిని కొనుగోలు చేసిన తమ సంస్థలోని సభ్యులు కొందరు మరణించారని, మిగిలిన వారు సైతం వయో వృద్ధులుగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా తమకు తమ స్థలాన్ని అప్పగించాలని కోరారు. హైడ్రా కమిషనర్‌ను కలిసిన వారిలో సొసైటీ ఎక్స్ చైర్మన్ వెంకట్ రెడ్డి, కన్వీనర్ ఉదయ్ చంద్, సభ్యులు వీరారెడ్డి, సత్యవతి, అనిల్ ఉన్నారు.

దరఖాస్తు గడువు పొడిగించాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఎన్‌పీడీఓ సంస్థ దివ్యాంగులు

చాదర్‌ఘాట్: దివ్యాంగులకు సహాయ పరికరాల దరఖాస్తు ఈనెల 30 వరకు పొడిగించాలని మంగళవారం వికలాంగుల సంక్షేమ సహకార సంస్థ కార్యాలయం ముందు ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు సహాయ పరికరాలు పొందేందుకు దరఖాస్తు గడువు 11 రోజులు మాత్రమే పెట్టడం అంటే వికలాంగులకు పరికరాలు అందకుండా చేయడమే అవుతుందని అన్నారు. కులం, ఆదాయం, సర్టిఫికెట్స్ జత చేయాలని నిబంధనతో వికలాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. టెండర్స్‌లో పేర్కొన్న పరికరాలు ఇవ్వకుండా, నాణ్యత లేని పరికరాలు ఇస్తున్నారని ఆరోపించారు. దరఖాస్తు గడువు పొడిగించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సహాయ పరికరాల దరఖాస్తు గడువు ఈనెల 30 వరకు పొడిస్తామని సహకార సంస్థ ఎండీ శైలజ హామీ ఇచ్చారు. దరఖాస్తు గడువు పొడిగింపుతో పాటు ఎడిట్ ఆప్షన్ కూడా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, శశికళ, చంద్రమోహన్, భుజంగారెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గం



జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ఎల్‌బీనగర్: ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గమని, ఆ మార్గంలో పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సీపీఐ పార్టీ హయత్‌నగర్ మండల కమిటీ 10వ మహాసభ హయత్‌నగర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ మహాసభకు ఆయనతో పాటు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి, నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మట్లాడుతూ.. భూపోరాటాల్లో వేలాది మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు, భూముల హక్కులు కల్పించిన ఘనత సీపీఐకే చెందుతుందన్నారు. వందేళ్ల చరిత్ర గల కమ్యూనిస్టు పార్టీ దేశ స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం, ప్రత్యేక తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిందన్నారు. సీపీఐ పార్టీ శతజయంతి ఉత్సవాల వేడుకలను వాడవాడల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభలో ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, మద్రి శోభన్, శేషరాజుపల్లి శ్రీదేవి, బొంగు అరుణ్‌కుమార్‌గౌడ్, రమావత్ సక్రు, పోలోజు లక్ష్మణ్ పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలంటూ ఆస్పత్రి ఎదుట ధర్నా

హస్తినాపురం: వైద్యం వికటించి తన భర్త మృతికి కారణమైన ఆసుపత్రి యాజమాన్యం నష్టపరిహారంగా రూ.12 లక్షల చెక్కు ఇచ్చి బ్యాంకులో డిపాజిట్ చేసుకొమ్మని చెప్పి డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారని మృతుడి భార్య సిల్వేరు మంగమ్మ ఆరోపిస్తూ మంగళవారం ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. వైద్యం వికటించి తన భర్త సిల్వేరు మల్లయ్య గత నెల 15న మృతి చెందడంతో పెద్ద మనుషుల సమక్షంలో నష్టపరిహారంగా రూ.12 లక్షలు ఒప్పుకున్నారు. సదరు చెక్కును ఈ నెల 12న బ్యాంకులో డిపాజిట్ చేయగా ఆసుపత్రి యాజమాని సుధాకర్‌రెడ్డి అకౌంట్‌లో డబ్బులు లేవని ఇప్పుడు అప్పుడు అంటూ కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు ఇచ్చిన చెక్కును తీసుకుని నగదు ఇవ్వాలని లేకుంటే ఆస్పత్రి ఎదుట ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని బాధిత కుటుంబ సభ్యులు హెచ్చరించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

చాదర్‌ఘాట్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మలక్‌పేట బధిరుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ యుగంధర్ పిలుపునిచ్చారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు మంగళవారం మలక్‌పేటలోని బధిరుల ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

మహేశ్వరం: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ సైదులు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మెహబ్బత్‌నగనర్, మన్సాన్‌పల్లిలో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ నవత, ఆర్ఐ స్వర్ణకుమారి, జూనియర్ అసిస్టెంట్ నరేందర్, టైపిస్టు కల్పన, రికార్డు అసిస్టెంట్ లక్ష్మణ్, సీనియర్ అసిస్టెంట్ పావని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

సజీవ దహనమైన ఆ ఇద్దరు ఎవరో?

నాగోలు: ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధి సాగర్ రింగ్ రోడ్డు సమీపంలో ఆదివారం రాత్రి విద్యుత్ తీగలు పడి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఫుట్‌పాత్‌పై పడుకున్న ఇద్దరు వ్యక్తులు ఎవరనేది ఇంత వరకు గుర్తించలేదు. పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. వారిద్దరు ఎవరు... అక్కడికి ఎందుకు వచ్చారనేది మిస్టరీగా మారింది. స్థానికంగా ఉన్న వారిని నుంచి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. స్థానికంగా భిక్షాటన చేసుకుని ఫుట్‌పాత్‌పై నిద్రపోతారని కొంమంది తెలిపారు. మృతి చెందిన వారి మృతదేహాలు పూర్తిగా కాలిపోవడం, వారి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తించేందుకు ఇబ్బందిగా మారుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



డా.తరుణి

చాదర్‌ఘాట్: వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఓల్డ్‌మలక్‌పేట యూపీహెచ్‌సీ మెడికల్ అధికారి డా.తరుణి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విషజ్వరాలు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తీవ్రమైన జ్వరంతో పాటు ఇతర లక్షణాలు ఉంటే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లాన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రములోనూ అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

ఓపెన్ క్యాంపస్ డ్రైవ్‌కు స్పందన



ఎంపికైన విద్యార్థులతో అప్పారావు

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ అవంతి డిగ్రీ, పీజీ కాలేజీ క్యాంపస్‌లో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, ప్లే కన్సల్టింగ్ సర్వీసెస్ సహకారంతో మంగళవారం ఓపెన్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ.. యువతకు కలిసి వస్తున్న ఉపాధి, ఉద్యోగావకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించిందని 86 కాలేజీల నుంచి 362 విద్యార్థులు హాజరు కాగా, 147 ఎంపికయ్యారన్నారు.

పార్కింగ్ వాహనాల తొలగింపు



పార్క్ వద్ద పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించిన దృశ్యం

వనస్థలిపురం: వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ వద్ద సీజ్‌చేసి నెలల తరబడి పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను తరలించారు. వివిధ కేసులలో సీజ్ చేసిన వాహనాలను పోలీస్‌స్టేషన్ పక్కరోడ్డులో, సమీపంలోని హెచ్‌ఎండీఏ పార్క్ ముందు పార్కింగ్ చేస్తున్నారు. ఈ వాహనాల పార్కింగ్‌తో పార్కుకు వచ్చేవారు, సమీప గృహస్తులు కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో పార్క్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి వాహనాలను తొలగించాలని కోరడంతో ఎట్టకేలకు వాటిని తొలగించారు.

దేవాలయ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని వాదే ముస్తఫా బస్తీలోని ప్రాచీనమైన వీరాంజనేయ స్వామి ఆలయ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీజేపీ జల్‌పల్లి మున్సిపాలిటీ, బడంగ్‌పేట్ అధ్యక్షులు టి.మనోజ్‌కుమార్, రాళ్లగూడం రామకృష్ణారెడ్డి కోరారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డి, జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన ఆలయ స్థలాన్ని ఓ పార్టీకి చెందిన నాయకుడు కబ్జా చేయడం హిందూ ధర్మంపై దాడిగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయ స్థలాన్ని పూర్తిగా ఆక్రమించి పార్టీ కార్యాలయాన్ని నిర్మించడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఈ స్థలాన్ని కబ్జా చెర నుంచి విడిపించి, కారకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మహేశ్వరం మండలం బీజేవైఎం అధ్యక్షుడు శ్రావణ్, రంగారెడ్డి జిల్లా దిశా బోర్డు సభ్యుడు అంబాజీ శ్రీనివాస్ యాదవ్‌తో పాటు శాంతకుమార్, సంతోష్, నాగార్జున, శ్రీకాంత్, హరికృష్ణ, రాజేందర్, శివ, అరవింద్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర కేంద్రాలుగా అంగన్వాడీలు

- రంగారెడ్డి జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత



అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్న శ్రీలత

దిల్‌సుఖ్‌నగర్: అంగన్వాడీలు అక్షర కేంద్రాలని రంగారెడ్డి జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ ఫేస్-3 కేంద్రంలో మంగళవారం నిర్వహించిన అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నేటి బాలలే రేపటి పౌరులని ఐదేళ్లలోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అక్షరాభ్యాసంతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తున్నాయన్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల వరకు బాలామృతం, గుడ్లు ఇంటికి సరఫరా చేస్తారని మూడు సంవత్సరాల వయస్సు నుంచి ఐదు సంవత్సరాల వయస్సు ఉన్న బాలబాలికలను కచ్చితంగా అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ సీడీపీఓ రేణుక, సూపర్ వైజర్ సావిత్రి, యాదగిరి, అంగన్వాడీ టీచర్లు గంగా, పుష్పలత, సునీత ఆశా వర్కర్లు హేమలత, వెంకటమ్మ, అంజమ్మ, కళమ్మ పాల్గొన్నారు.

బీసీల చైతన్యమే లక్ష్యం



జెండా ఆవిష్కరణలో బ్రహ్మయ్య

నాగోలు: రాజకీయాలకు అతీతంగా బీసీలను చైతన్యం చేయడమే మన ఆలోచన సాధన సమితి లక్ష్యమని మాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం నాగోలు పరిధిలో మంగళవారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ.. బీసీల హక్కులు సాధించుకునేందుకు అందరూ ఐక్యంగా ఉండి రాజ్యాధికార దిశ వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. లక్ష్యసాధనకు బీసీలంతా ఐక్యంగా మన ఆలోచన సాధన సమితితో కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దశరథ, అంజయ్య, కిషోర్, బాలయ్య చెదురవెల్లి, వెంకటయ్య, పవన్ వాల్మీకి, పెండ్యాల అంజి, వెంకటయ్య, జంగయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో చేపట్టిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో దోమలతో మలేరియా, డెంగీ తదితర విషజ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని, దోమలు వ్యాప్తి చెందకుండా తమ ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు టీ.వీ.రావు, మల్లికార్జున్, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, దివాకర్, మదన్, సంగ్రాం, సత్యనారాయణ, వెంకటేష్, శానిటేషన్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మొక్కలు, ట్రీగార్డుల తొలగింపుపై ఆగ్రహం



ధ్వంసమైన మొక్కలను పరిశీలిస్తున్న కార్పొరేటర్

చైతన్యపురి: ఎలాంటి సమాచారం లేకుండా పూల మొక్కలు, ట్రీగార్డులను ధ్వంసం చేయడంపై గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కమలానగర్ కాలనీలో ఓ కార్యాలయం ప్రహరీకి ఆనుకుని 20 ఏళ్లుగా ఉన్న పూలమొక్కలు, ట్రీగార్డులను ముందస్తు సమాచారం ఇవ్వకుండా ధ్వంసం చేస్తున్నారని కాలనీవాసులు సమాచారం ఇవ్వటంతో అక్కడకు వెళ్లిన కార్పొరేటర్ టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేశారు. అధికారుల తీరును ప్రశ్నించిన సీనియర్ సిటిజన్స్‌కు సమాధానం ఇవ్వకుండా తమకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పి మొక్కలను ధ్వంసం చేయటం పద్ధతి కాదన్నారు. బడాబాబుల ఇళ్ల ముందున్న చెట్లను ఇలాగే ధ్వంసం చేస్తారా అని ప్రశ్నించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్ట్రామ్ వాటర్ పైపులైన్ల పనులు పూర్తి చేయాలి



వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్లు పవన్‌కుమార్, రాధా ధీరజ్‌రెడ్డి

నాగోలు: ఎల్‌బీనగర్ నుంచి అల్కాపురి జంక్షన్ వరకు కొనసాగుతున్న స్ట్రామ్ వాటర్ పైప్‌లైన్ల పనులను త్వరగా పూర్తి చేయాలని కొత్తపేట, ఆర్‌కేపురం డివిజన్ల కార్పొరేటర్లు నాయికోటి పవన్‌కుమార్, రాధా ధీరజ్‌రెడ్డి మంగళవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షం కాలం రాక ముందే స్ట్రామ్ వాటర్ పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలని అందుకోసం రూ. 25 కోట్లు మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరారు. న్యూమారుతి నగర్, ఓల్డ్ మారుతి నగర్, కొత్తపేట విలేజ్, బృందావన్ కాలనీల్లో నూతన సీసీ రోడ్డులను మంజూరు చేయాలని కోరారు.

పెద్దచెరువును అభివృద్ధి చేయాలి



పెద్దచెరువు వద్ద అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

- ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: పెద్దచెరువును అన్ని విధాలా అభివృద్ధి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మీర్‌పేట పెద్దచెరువు వద్ద చేపడుతున్న అభివృద్ధి పనులను కార్పొరేషన్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. సుందరీకరణలో భాగంగా బతుకమ్మ ఘాట్, వాకింగ్ ట్రాక్, లైట్లు, క్రీడా ప్రాంగణాలను పరిశీలించి పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, మాజీ ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు పల్లె జంగయ్యగౌడ్, రాజ్‌కుమార్, భూపేశ్‌గౌడ్, కామేశ్‌రెడ్డి, మాదరి రమేశ్, రాఘవరెడ్డి, సునీత, విజయలక్ష్మి ఉన్నారు.